సాక్షి
విశాఖపట్నం
గురువారం । 4 । జూలై । 2024



అధికారులపై జీఎం ఆగ్రహం

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ దువ్వాడ రైల్వే స్టేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో



కోస్టల్ రైడర్స్ బోణీ

ఏపీఎల్‌లో భాగంగా బెజవాడ టైగర్స్‌పై కోస్టల్ రైడర్స్, గోదావరి టైటాన్స్‌పై రాయలసీమ కింగ్స్ విజయం సాధించాయి. 8లో

అగ్గిపిడుగు.. అల్లూరి



తెల్లదొరల గుండెల్లో మరఫిరంగిగా మారి.. తెలుగు నేలపై విప్లవ బీజాలు నాటిన మన్యం వీరుడి 127వ జయంతి నేడు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సింహగిరిపై కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం కొత్త కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కలెక్టర్‌కి అందజేశారు.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతులు



రెస్ట్‌రూం, క్రెచ్‌లను ప్రారంభిస్తున్న ఈకార్వో అధ్యక్షురాలు కవితా ఫంక్‌వాల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ కవితా ఫంక్‌వాల్ వాల్తేర్ డివిజన్ పరిధిలో మొదటిసారిగా బుధవారం పర్యటించారు. ఇందులో భాగంగా డీజిల్ లోకోషెడ్‌లో మహిళా ఉద్యోగినుల కోసం ఆధునీకీకరించిన విశ్రాంతి గది, బేబీ క్రెచ్‌లను ఆమె ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ ఈకార్వో ప్రెసిడెంట్, ప్రతినిధుల సహాయంతో ఈ సౌకర్యాలను కల్పించారు. సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్(డీజిల్) ఆర్ఆర్ మిశ్రా, ఈకార్వో వాల్తేర్ డివిజన్ ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, డీజిల్ లోకోషెడ్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పోర్టులో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన



పోర్టు అధికారులతో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

సాక్షి, విశాఖపట్నం : స్టడీ టూర్‌లో భాగంగా ఆరుగురు సభ్యుల ట్రైనీ ఐఏఎస్ బృందం విశాఖపట్నం పోర్టును బుధవారం సందర్శించింది. డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలు, మౌలిక వసతులు, ఎగుమతులు దిగుమతులు, సరుకు రవాణాలో చేపడుతున్న పద్ధతులు, పోర్టు ఆధునీకీకరణ, యాంత్రీకరణ, పచ్చదనం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలు, కవర్డ్ స్టోరేజ్ యార్డ్‌ల నిర్మాణం, సోలార్ పవర్, నీటి శుద్ధి ప్లాంట్ వంటి అనేక అంశాల్ని డిప్యూటీ చైర్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రైనీ బృందానికి వివరించారు. పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలను తెలియజేసిన దూబే, పోర్టు ఉన్నతాధికారులకు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏయూ పరిధిలో పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన పలు డిగ్రీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ విద్యార్థి సంఘాలు ఈ నెల 4న బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో డిగ్రీ రెండవ, నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. బి.ఎ., బి.ఎస్సీ, బి.కాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్ఎంఅండ్‌సీటీ కోర్సుల పరీక్షలు వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఇగ్నోలో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 జూలై ప్రవేశాల గడువును పొడిగించినట్లు ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. https://ignouadmission.samarth.edu.in/వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు జులై 15 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజలతో మమేకమవుతా..

- విశాఖ అభివృద్ధికి కృషి చేస్తా..
- ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా నడుచుకుంటా..
- ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం
- విశాఖ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరేంధిర ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : కలెక్టర్ దగ్గరికి వస్తే కలవొచ్చు.. మన సమస్య వింటారు, పరిష్కరిస్తారు అనే నమ్మకాన్ని విశాఖపట్నం జిల్లా ప్రజలకు కలిగిస్తానని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి అవసరాలను తీరుస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పలు విభాగాల్లో, పలు స్థానాల్లో పనిచేసిన తనకు అన్ని వర్గాల కష్టాలు, సమస్యలు తెలుసని వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. జిల్లా నూతన కలెక్టర్‌గా ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కలెక్టర్ ఏమన్నారంటే..

ఏపీ గర్వించదగ్గ నగరమిది..

ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విశాఖ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా నా వంతు కృషి చేస్తాను. పర్యాటకంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు అమలు చేస్తాను. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో ఉండే ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి పెడతాను. నగరీకరణలో భాగంగా యాక్సెసబుల్ రోడ్లు ఉండేలా చూస్తాను. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాను.

భూ సమస్యలపైనా హడావుడిగా చర్యలుండవ్

జిల్లాలో భూ సంబంధిత సమస్యలు, వివాదాలు చాలా ఉన్నాయి. వీటన్నింటిపై హడావుడిగా చర్యలు తీసుకునే ప్రసక్తే లేదు. ప్రతి భూ సమస్యపైనా లోతుగా దర్యాప్తు చేసి దానికనుగుణంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కోర్టు ఆర్డర్లు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటాం. జగనన్న కాలనీలపై ప్రభుత్వం ఏ తరహా నిర్ణయం తీసుకుంటుందో దాని ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా నడుచుకుంటాను. ఆరోగ్య శ్రీ ద్వారా అందరికీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటాను. ఆరోగ్యశ్రీలో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి కేజీహెచ్, విమ్స్ అభివృద్ధి చెందేలా ప్రతి వారం వైద్య రంగంపై రివ్యూ నిర్వహిస్తాను.

కలెక్టర్‌కు అధికారులు, ప్రముఖుల శుభాకాంక్షలు

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తన చాంబర్‌లో కలిసి స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో దేవ్ ప్రసాద్, ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖకు చెందిన అధికారులు తదితరులు కలెక్టర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ, ఫైనాన్షియల్ సంస్థలు తీసుకొచ్చేందుకు కృషి

ఈ నగరాన్ని ఆర్థిక, ఐటీ రాజధానిగా అభివృద్ధి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ముందున్న లక్ష్యం. ఆ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని యువతకు అన్ని అంశాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐటీ సంస్థలు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్స్ వచ్చేందుకు కృషి చేస్తాను.

విశాఖ నగర యువత, మహిళలకు ఆర్థిక భరోసా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.. ఏ స్కిల్స్.. ఎవరికి అవసరం అనేదానిపైనా దృష్టిసారిస్తాం. జిల్లాలో ఉద్యోగాలున్నాయి.. కానీ.. దానికనుగుణంగా నైపుణ్యం కలిగిన వారు దొరకడం లేదని గమనించాను. దానిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాను. ఆర్థిక, వాణిజ్య అంశాలే అజెండాగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతా.

ఉద్యమంలా మొక్కల పెంపకం



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన నాటకంలో ఓ సన్నివేశం



ప్రశంసా పత్రం అందిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

- విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు
- పోర్టు ఆధ్వర్యంలో పది లక్షల మొక్కల పంపిణీ

సాక్షి, విశాఖపట్నం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, పోర్ట్ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో 10 లక్షల మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టామని విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం పోర్టు సాంబమూర్తి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మిలియన్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అంశాన్ని కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం కాకుండా.. ప్రతీ ఒక్కరి ఇంటి నుంచి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. మొక్కల పంపిణీకి సంబంధించి వీపీఏ ఇచ్చిన పిలుపునకు పలు సంస్థల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఒక్క పోర్ట్ ఉద్యోగికి ఓ మొక్క పంపిణీ చేయాలని చైర్మన్ ఆకాంక్షించారు. మొక్కలకు సంబంధించి పోర్టుకి వచ్చిన 2,17,069 అభ్యర్థనల్లో లక్ష మొక్కలను విశాఖ జిల్లా నవనిర్మాణ సమితికి, 26,000 మొక్కలను విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌కు, 40,000 మొక్కలను రాంకీ గ్రూప్, బ్రాండిక్స్ కంపెనీలకు, 15,000 మొక్కలను జీవీఎంసీకి, 5,500 మొక్కలను సీఐఎస్ఎఫ్ విశాఖపట్నం యూనిట్‌కు అందజేశారు. వీటిలో నిమ్మ, బాదం, కదంబ, వేప, పిప్పళి, కానుగ, గుల్మోహర్, స్పాతోడియా, టబేబుయా, మిల్లింగ్టోనియా, మహోగనీ, ఇండియన్ టులిప్, టెర్మినాలియా, కాసియా, అకాసియాతో పాటు కొబ్బరి, మామిడి, జీడి, సపోటా, జామ, సీతాఫలం, యాపిల్, వాటర్ యాపిల్, ఉసిరి వంటి పండ్ల మొక్కలున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోర్ట్ భాగస్వాములు, పోర్ట్‌లోని వివిధ విభాగాల మధ్య స్వచ్ఛ భారత్, పచ్చదనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శించిన నాటిక ఆలోచింపజేసింది. పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్ స్వామి, రామకృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ప్రభాకర్

విశాఖకు మరో ఏసీపీ ప్రసాదరావు



విశాఖ సిటీ : విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా కె.ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీనివాసరావును అనకాపల్లి డీటీసీగా స్థానచలనం కలిగించారు. అలాగే విశాఖకు మరో ఏసీపీ సిహెచ్.జి.వి.ప్రసాదరావును బదిలీ చేశారు. ప్రస్తుతం ఈయన రాజమండ్రి ఏసీబీ డీఎస్పీగానే కాకుండా విశాఖ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా అటాచ్‌మెంట్‌లో ఉన్నారు.

మరికొద్ది రోజుల్లో మరిన్ని బదిలీలు

మరికొద్ది రోజుల్లో డీసీపీలు, ఏసీపీ స్థాయి అధికారులకు స్థానచలనానికి రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి కొంత మంది పోలీస్ అధికారులు విశాఖలో పోస్టింగ్‌ల కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన వారే మళ్లీ నగరానికి వచ్చేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం విశాఖలో ఉన్న ముగ్గురు ఏసీపీలు నగరం నుంచి వెళ్లకుండా స్థానిక ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకొనే పనిలో ఉన్నారు. అయితే పోలీస్ అధికారుల బదిలీలను పార్టీ పెద్దలే చూసుకుంటున్నారన్న చర్చ టీడీపీలో జరుగుతోంది. స్టేషన్ సీఐ, ఎస్ఐల బదిలీల విషయంలో మాత్రం స్థానిక నేతల అభిప్రాయాలు, సిఫార్సులు పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

ఏఆర్ నుంచి ట్రాఫిక్‌కు నలుగురు ఎస్ఐలు

విశాఖ సిటీ : నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ దృష్టి పెట్టారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిటీ పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బందిని కూడా వినియోగించుకోవాలని నిర్ణయించారు. దీంతో సిటీ ఏఆర్‌లో ఉన్న నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను పలు ట్రాఫిక్ ఎస్ఐలుగా తాత్కాలికంగా పోస్టింగ్‌లు కల్పించారు. ఈ మేరకు బుధవారం సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సిటీ ఏఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎండీ ఖాదర్ బాషాను ఎంవీపీ ట్రాఫిక్, ఎస్.కె.నజారుద్దీన్‌ను టూ టౌన్ ట్రాఫిక్, వి.నారాయణరావును త్రీటౌన్ ట్రాఫిక్, జి.విజయ్‌కుమార్‌ను గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు.

ఏసీబీలో ముగ్గురికి స్థానచలనం

విశాఖ అవినీతి నిరోధక శాఖలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు, ఒక ఎస్ఐకి స్థానచలనం కలిగింది. ఇన్‌స్పెక్టర్ బి.వి జయ్‌కుమార్‌ను గుంటూరు రేంజ్‌కు, మరో ఇన్‌స్పెక్టర్ జి.ప్రేమ్‌కుమార్‌ను, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.మనోజ్‌కుమార్‌ను విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు.

రోడ్డెక్కిన టీడీపీ కుమ్ములాటలు

- ఆ పార్టీ నాయకుడి అక్రమాలపై 7వ వార్డు కార్పొరేటర్ మంగమ్మ ఫిర్యాదు
- ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్ల ఆధ్వర్యంలో విచారణ
- నాయకుల తీరుపై మానం ఆంజనేయులు కాలనీవాసుల ఆగ్రహం



రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు మానం ఆంజనేయులు కాలనీలో రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ ప్రారంభించారు. ఇక్కడ అక్రమాలు జరుగుతున్నాయని, వాటి వెనుక స్థానిక టీడీపీ నాయకుడి ప్రమేయం ఉందని అదే పార్టీకి చెందిన 7వ వార్డు కార్పొరేటర్ మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన డిప్యూటీ తహసీల్దార్లు గోవింద్, సంజీవరావు, కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.125/2, 126/2లో గతంలో ప్రభుత్వం వీకర్ సెక్షన్ కాలనీలో భాగంగా 325 ప్లాట్‌లతో లే అవుట్ ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్టు చెప్పారు. అప్పట్లో కేటాయించిన వారిలో ఎంత మంది ప్రస్తుతం ఇక్కడ ఉన్నారు... వారి ఫోన్, ఆధార్, ఇంటి పన్ను రసీదు, కరెంటు కనెక్షన్, పట్టా వివరాలు సేకరించారు. లబ్ధిదారులే ఉంటున్నారా..? వేరే వాళ్లు ఉంటున్నారా..? స్థలం ఎవరికి కేటాయించారు...? కేటాయించిన వారే ఇళ్లు కట్టుకున్నారా... లేక ఎవరికైనా అమ్మేశారా..? తదితర వివరాలు సేకరించారు. ఈ స్థలం ఏ జీవో కింద, ఎప్పుడు క్రమబద్ధీకరించారు..? ప్రస్తుతం కోర్టులో ఏయే ప్లాట్ల వివాదాలు నడుస్తున్నాయి..? ఎవరు కేసు వేశారన్న వివరాలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు.

రెండు వర్గాలుగా టీడీపీ నాయకులు

అయితే అధికారులు విచారణ చేపడుతున్న మానం ఆంజనేయులు కాలనీలోకి స్థానిక టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 5, 7 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలివచ్చారు. ఈ వ్యవహారంతో టీడీపీ అంతర్గత కుమ్ములాటలు రోడ్డుకెక్కాయి. సొంత పార్టీ నాయకుడిపైనే ఫిర్యాదు చేసి... విచారణ చేయించడంతో వార్డులోని నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లుకి వచ్చినప్పుడు ఈ అక్రమాలు కనిపించలేదా అని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. టీడీపీ నాయకుల తీరుపై కాలనీవాసులు మండిపడుతున్నారు. 'ఏటికాడ ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా టీడీపీ కార్పొరేటర్ పరిస్థితి ఉందంటూ పలువురు అంటున్నారు.

వైభవంగా వరదపాయస ఉత్సవం

- సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై విశేష సేవ
- స్వామికి అభిషేకాలు, పాయసం నివేదన
- పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడిచిన అర్చకులు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు



వైకుంఠవాసుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు





పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) విశేష అలంకారంలో వైకుంఠవాసుడు

సింహాచలం: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వైకుంఠవాసుడిని వేడుకున్నారు భక్తజనులు. సింహగిరిపై వైకుంఠవాసుడి మెట్టపై వరదపాయసం సేవను శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు బుధవారం విశేషంగా నిర్వహించారు. వైకుంఠవాసుడి సన్నిధిలో పాయసం వండి, సమీపంలో ఉన్న పొర్లు బండపై నుంచి జారవిడిచారు. ఉదయం 9గంటల నుంచి అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ద్వాదశ కలశ స్నపన తిరుమంజనం, విశేష ఆరాధన ఘనంగా నిర్వహించారు. విరాట్‌పర్వాన్ని పారాయణం చేశారు. అనంతరం అక్కడే వండిన పాయసాన్ని స్వామికి నివేదించి, సమీపంలో ఉన్న పొర్లు బండపై ఆ పాయసాన్ని జారవిడిచారు. భక్తులు పొర్లు బండపై నుంచి జారే పాయసాన్ని తీసుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'జీఆర్‌టీ' సహకారంతో వైకుంఠనాథుడి ఆలయ అభివృద్ధి

ఎంతో విశిష్టత కలిగిన వైకుంఠనాథుడి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవస్థానం చర్యలు చేపట్టిందని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దానికి సంబంధించిన ప్రణాళికలు కూడా తయారు చేశామని, అయితే జీఆర్‌టీ జ్యూయలర్స్ యాజమాన్యం అభివృద్ధి పనులకు ముందుకు వచ్చిందని తెలియజేశారు. ఆలయ ప్రాంగణాన్ని భక్తులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా విజిటింగ్ పాయింట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నిత్యం ధూప దీప నైవేద్యాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు, లైటింగ్, టాయిలెట్లు, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెక్యూరిటీ ఉంటుందన్నారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని భావిస్తున్నామన్నారు. అలాగే, వైకుంఠనాథుడి సన్నిధికి సమీపంలోనే జీఆర్‌టీ జ్యూయలర్స్ ఏర్పాటు చేస్తున్న శంఖుచక్రనామాల పనులను గిరిప్రదక్షిణలోపు పూర్తి చేస్తామన్నారు. శ్రీకృష్ణదేవరాయల విజయ స్థూపం ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కూడా కల్పిస్తామని వివరించారు.

నిలిచిన 80 మంది పింఛన్లు?



మంచంపై ఉన్న పేకేరు గ్రామానికి చెందిన బాధితురాలు చినతల్లమ్మ

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేయడంతో లోపాలు బయటపడ్డాయి. సచివాలయ సిబ్బందికి పూర్తిగా లబ్ధిదారులపై అవగాహన లేకపోవడం, పింఛన్ల పంపిణీని రెండు రోజులకే పరిమితం చేయడంతో ప్రతి పంచాయతీలో పదుల సంఖ్యలో లబ్ధిదారులకు సొమ్ము చేరలేదు. దీంతో పింఛను సొమ్ము తప్ప మరే ఆధారం లేని అవ్వాతాతల పరిస్థితి దయనీయంగా మారింది. నెలవారీ మందులు, కిరాణా, టిఫిన్ తదితర ఖర్చులు కూడా చెల్లించుకోలేని పరిస్థితుల్లో ఈ అభాగ్యులు దిక్కులు చూస్తున్నారు. ఇలా ఆనందపురం మండలంలో 80 మంది వరకు ఈ నెల పింఛన్లు అందలేదని తెలుస్తోంది. సచివాలయ సిబ్బంది మాత్రం సాంకేతిక కారణాల వల్లే పింఛన్లు రాలేదని చెప్పి తప్పించుకుంటున్నారు.

పాపం చినతల్లమ్మ..

మండలంలోని పేకేరు పంచాయతీకి చెందిన 86 ఏళ్ల జాడ చినతల్లమ్మకు ఈ నెల సాంకేతిక కారణాల సాకుతో వృద్ధాప్యపు పింఛను అందించ లేదు. పూర్తిగా మంచానికే పరిమితం అయిన ఆమె కూతురు కుమారుడైన శ్రీనుపై ఆధారపడి ఉంది. ఇలాంటి ఏ చిన్న ఆధారం కూడా లేకుండా పదుల సంఖ్యలో అభాగ్యులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. దీనిపై రాష్ట్ర దాసరి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాళ్ల గౌరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెతికి వెతికి లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్టు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బాధితులను గుర్తించి.. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న దృష్ట్యా చేపట్టాల్సిన బందోబస్తుపై బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గతంలో జరిగిన పలు గిరి ప్రదక్షిణ బందోబస్తు ఏర్పాట్లను వీడియోల ద్వారా పరిశీలించారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎక్కడా ట్రాఫిక్ స్తంభించకుండా ముందస్తు చర్యలపై చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. గిరి ప్రదక్షిణలో భాగంగా సముద్ర స్నానాలు చేసే భక్తులను అప్రమత్తం చేసే ఏర్పాట్లపైన, ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రదక్షిణ ముగించుకొని దర్శనానికి వెళ్లే భక్తులకు క్యూలైన్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ బారికేడ్ల ఏర్పాటు చేయాలన్నారు. గిరి ప్రదక్షిణ చేసే మార్గాలన్నీ పూర్తి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. డ్రోన్ కెమెరాలు, బాడీ వార్న్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 బి.లక్ష్మీ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపోలోలో యువకుడికి అరుదైన చికిత్స

ఆరిలోవ: సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న ఓ యువకుడికి అపోలో వైద్యులు అరుదైన చికిత్స చేశారు. నగరానికి చెందిన 16 ఏళ్ల యువరాజు నాలుగేళ్ల వయసు నుంచే సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్నాడని అపోలో ఫిజిషియన్ డాక్టర్ రాకేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. కొద్ది రోజుల కిందట యువరాజును అతని బంధువులు అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారని, ఆయన్ని పరిశీలించి వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. ఈ వ్యాధి నివారణకు మొదటిసారిగా బోన్ మ్యారో(స్టెమ్‌సెల్) మార్పిడి విధానం ద్వారా విజయవంతంగా శస్త్రచికిత్స చేసినట్లు వివరించారు. ఇప్పుడు యువరాజు ఆరోగ్యంతో ఉన్నాడన్నారు. రాష్ట్రంలో ఈ విధానం ద్వారా చికిత్స అందించడం ఇదే మొదటిసారని ఆయన వెల్లడించారు.

నేడు రోశయ్య 91వ జయంతి వేడుకలు

విశాఖ సిటీ: మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలను ఈ నెల 4న ఘనంగా నిర్వహించనున్నట్లు పైడా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు సిరిపురం ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, గౌరవ అతిథిగా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, అతిథులుగా విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

స్వాములు రాజకీయాలకు దూరంగా ఉండాలి

డాబాగార్డెన్స్: సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆనంద శర్మ రాజకీయాలు మాట్లాడడంతోపాటు శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీపై లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని విశ్వ హిందూ పరిషత్ నేత విజయ శంకర్ ఫణి అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం పెందుర్తి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది స్వామీజీల వైఖరితో బ్రాహ్మిన్ వ్యవస్థకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామీజీలపై దుష్ప్రచారం తగదన్నారు. స్వామీజీలంటే సర్వ సంఘ పరిత్యాగం చేసే వారని గుర్తు చేశారు. క్రైస్తవులు, మసీదుల్లో జరిగే వ్యవహారాలపై ఎవరూ రోడ్డెక్కడం లేదని, కాషాయం ముసుగులో అజెండా అంటూ రాద్ధాంతం చేయడం తగదన్నారు. పీఠాలకు ప్రభుత్వాలు భూములు ఇవ్వడం సర్వసాధారణ విషయమన్నారు. శివగణేష్ శాస్త్రి, ఏఎస్‌కే శాస్త్రి, సూర్య ప్రకాష్‌శర్మ, స్వరూప్ శర్మ, ప్రమోద్ శర్మ, అశోక్ శర్మ, బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవీలత, చార్లెస్, విజయకుమార్ శర్మ పాల్గొన్నారు.



పాండ్రంగిలో అల్లూరి జనన గృహం

నేడు 127వ జయంతి

అగ్గిపిడుగు.. అల్లూరి



పాండ్రంగిలో అల్లూరి విగ్రహం

వీరత్వం.. పౌరుషానికి ప్రాణం పోస్తే కనిపించే రూపం.. బ్రిటిషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి. అహింసా పోరాటానికి ఆద్యుడిగా గాంధీని చెప్పుకుంటే.. సాయుధ పోరాటమే శరణ్యమని నమ్మి తమ జీవితాన్నే అర్పించిన ధీరుడు మన్యం వీరుడు. ఆంగ్లేయుల దోపిడీకి గురైన అమాయక గిరిజనుల్లో విప్లవాగ్ని రగిలించి.. తెల్లదొరల గుండెల్లో మరఫిరంగిగా మారి.. తెలుగు నేలపై విప్లవ బీజాలు నాటిన ఆ మహనీయుడు.. వ్యక్తి కాదు సమూహశక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం.. నేడు ఆయన 127వ జయంతి.

పద్మనాభం: అల్లూరి సీతారామరాజు అసలు పేరు శ్రీరామరాజు. మన్యం వీరుడిగా.. అగ్గిపిడుగుగా గుర్తింపు పొందిన అల్లూరి విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలో 1897 జులై 4న తాతగారింట వెంకటరామరాజు, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. మొదట బిడ్డ కావడం వల్ల శ్రీరామరాజును అందరూ ముద్దుగా చిట్టిబాబు అని పిలిచేవారు. తల్లి సూర్యనారాయణమ్మకు అల్లూరి అంటే అమితమైన ప్రేమ. ఆయన తండ్రి రాజమహేంద్రవరంలో ఫొటోగ్రాఫర్. అందరూ ఆయన్ని ఫొటోల రాజు అనేవారు. బాల్యం పశ్చిమగోదావరి జిల్లా మొగల్లులో గడిచింది. నాలుగేళ్ల వయసు వరకు అక్కడే పెరిగారు. 1908లో రాజమహేంద్రవరంలో ఫస్ట్ ఫారం చదువుతుండగా తండ్రి వెంకటరామరాజు చనిపోయారు. అప్పటి నుంచి ఆయన కుటుంబం అనేక కష్టాలపాలైంది. మగదిక్కు కోల్పోయిన సూర్యనారాయణమ్మ మరదల సలహా మేరకు రాజమహేంద్రవరాన్ని విడిచిపెట్టి.. భీమవరానికి దగ్గరలోని కొవ్వాడలోని చెల్లెలు అప్పలనరసమ్మ ఇంటికి చేరుకుంది. శ్రీరామరాజు చదువు కొనసాగించాలన్న నిశ్చయంతో భీమవరంలోని బోర్డు మిడిల్ స్కూల్‌లో ఫస్ట్ ఫారంలో చేర్పించారు. అక్కడ విద్యాభ్యాసంలో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. తర్వాత ఆయన్ని రాజమహేంద్రవరంలోని వరసకు పినతండ్రి అయిన అల్లూరి రామరాజు(చెవిటి రామరాజు)కు 1910లో అప్పగించారు. అక్కడ వేదాంతం, యోగాభ్యాసం నేర్చారు తప్పితే.. పాఠ్య పుస్తక పఠనంపై ధ్యాస పెట్టలేకపోయారు. 1911లో కాకినాడ తహసీల్దారుగా పనిచేస్తున్న పినతండ్రి రామకృష్ణంరాజు వద్ద ఉంటూ సీతారామరాజు సెకండ్ థర్డ్ ఫారం చదివారు. 1912లో కాకినాడలో శశిరేఖా పరిణయం అనే నాటకంలో శశిరేఖ, నారద పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. కాకినాడలో ఉండగా ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్యతో పరిచయం ఏర్పడింది. 1913లో విశాఖపట్నంలోని ఎ.వి.ఎన్.కళాశాలలో ఫోర్త్ ఫారం చదివారు. చివరకు నరసాపురం టేలర్ స్కూల్లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. తునికి సమీపంలో వత్సవాయి నీలాద్రిరాజు వద్ద చందస్సు, జ్యోతిష్యం నేర్చుకున్నారు. ఇంగ్లిష్ భాష, విలువిద్య, గుర్రపు స్వారీలో సీతారామరాజుకు మంచి ప్రావీణ్యం ఉంది. అన్నవరం దేవస్థానంలో అల్లూరికి ఉపనయనం జరిగింది.

వణికిపోయిన బ్రిటిష్ పాలకులు

పితూరీలతో బ్రిటిష్ పాలకులు వణికిపోయారు. సీతారామరాజును ఎదుర్కొవడానికి బ్రిటిష్ ప్రభుత్వం భారీ కసరత్తు చేయాల్సి వచ్చింది. దొంగ దెబ్బ తీసైనా ఆయన అనుచరులను మట్టుపెట్టే వ్యూహం రచించింది. ఇందుకోసం అస్సాం రైఫిల్ దళాన్ని రప్పించి నిబంధనలు మరింత కఠినతరం చేసి దొరికిన వారిని దొరికినట్లే కాల్చి చంపమని ఉత్తర్వులు ఇచ్చింది. బ్రిటిష్ వారి దమన కాండకు గిరిజనులు నలిగిపోయారు. టీజీ రూథర్‌ఫర్డ్ నాయకత్వంలో 1,200 మంది పోలీసులు, 16 మంది ఉన్నతస్థాయి అధికారులు, 250 మంది చిన్నస్థాయి అధికారులను మన్యానికి పంపింది. సీతారామరాజు మంప సమీపంలోని మాడేరు నది వద్ద సంధ్యా వందనం చేస్తుండగా జమేదార్ కుంచు యేనక్‌కు 1924 మే 7న అల్లూరి దొరికిపోయారు. కుంచుయేనన్ సీతారామరాజును రాజేంద్రపాలెంలో చెట్టుకు కట్టగా కల్నల్ గుడాల్ కాల్చి చంపాడు. తర్వాత సీతారామరాజు భౌతిక కాయాన్ని నులక మంచానికి కట్టి కొయ్యూరు నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి కృష్ణదేవిపేట శివారు శరభన్నపాలేనికి వెళ్లే మార్గంలో అంత్యక్రియలు చేశారు. అల్లూరి భౌతికంగా జీవించింది 27 ఏళ్లే అయినా.. భారతీయుల గుండెల్లో ఆయన సజీవులే.. అల్లూరి అంటే తరగని కీర్తి.. పోరాటాలకు తరగని నిత్య స్ఫూర్తి. గత ప్రభుత్వం పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేసింది. మన్యం వాసులు ఊరూరా అల్లూరి విగ్రహాలు నెలకొల్పి.. ఆయన్ని అనునిత్యం స్మరించుకుంటున్నారు.

నేడు పాండ్రంగిలో జయంతి వేడుకలు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించేందుకు పాండ్రంగిలోని అల్లూరి వేదిక వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారు. కాగా.. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కనీసం రంగులు కూడా వేయలేదని పలువురు విమర్శిస్తున్నారు.

విప్లవ శంఖారావం

అల్లూరికి భక్తి భావాలు ఎక్కువ. కాళికా దేవికి పరమ భక్తుడు. ఈ నేపథ్యంలో ఆయన తీర్థయాత్రలకు 1915లో బయలుదేరి కాశీ, హరిద్వార్ వంటి పుణ్యక్షేత్రాలు దర్శించారు. మార్గమధ్యలో ఆయన దేశకాలమాన పరిస్థితులను అవగాహన చేసుకోవడం మొదలుపెట్టారు. దేశ స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి లూదిన భారత జాతీయ కాంగ్రెస్‌తో ఆయనకు అనుబంధం ఉంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో బిపిన్ చంద్రపాల్, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి వారిని కలుసుకున్నారు. అనేక మంది విప్లవకారులను రహస్యంగా కలుసుకుని సాయుధ పోరాటం వైపు ఆకర్షితుడయ్యారు. 1917లో తన ఇష్ట దైవమైన కాళికా మాతను ప్రసన్నం చేసుకోవడం కోసం ఆయన కొయ్యూరు సమీపంలోని మాకవరపాలెం చేరారు. ఆయుర్వేద వైద్యంపై ఆయనకు పట్టు ఉండేది. ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలు అందించేవారు. అక్కడ గిరిజనులు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయారు. బ్రిటిష్ వారిని ఎదుర్కొని గిరిపుత్రులకు విముక్తి కల్పించాలని నిశ్చయించుకున్నారు. తెల్ల దొరలపై విప్లవ శంఖారావం పూరించారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన సాయుధ పోరాటానికి బాటలు వేశారు. గాం గంటం దొర, మల్లు దొర, గోకులు ఎర్రేసు, బొంకుల మాదిగాడు, కర్రి కన్నిగాడు, వనసల కన్నయ్య పడాల్ వంటి వారితో కలిసి సీతారామరాజు విప్లవ జ్యోతిని రగిలించారు.

గెరిల్లా పోరాటం

గెరిల్లా పోరాటంలో చేయితిరిగిన నేతగా అల్లూరిని చెబుతారు. కంకిపాటి ఎండుపడాల్, గంటందొర, రామరాజు, మల్లు దొర నేతృత్వంలో బ్రిటిష్ పాలకులపై గెరిల్లా పోరాటానికి మూడు బృందాలు ఏర్పడ్డాయి. 1922 ఆగస్టు 22న 300 మంది సాయుధులతో చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై మెరుపుదాడి చేసి 11 తుపాకులు, 1390 తూటాలు, ఐదు కత్తులు, 14 బోయ్‌నెట్లు స్వాధీనం చేసుకున్నారు. అదే ఏడాది ఆగస్టు 23న కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. 1923 అక్టోబర్ 26న గూడెంలోని మిలటరీ కేంద్రంపై గెరిల్లా సాయుధ పోరాట యోధులు దాడి చేశారు. సీతారామరాజు, అతని అనుచరులను పట్టిస్తే.. బహుమతి ఇస్తామని బ్రిటిష్ ప్రభుత్వం 1922లో ప్రకటించింది. 1922 డిసెంబర్ 6న బ్రిటిష్ దళాల కాల్పుల్లో పెద్ద గడ్డపాలెం వద్ద ఎనిమిది మంది సీతారామరాజు అనుచరులు చనిపోగా నలుగురు పట్టుబడ్డారు. మన్యం పోరాటంలో మిరపకాయ టపా మరిచిపోలేని గెరిల్లా తంత్రంగా చరిత్రకారులు చెబుతారు.

డివైడర్‌ను ఢీకొని తండ్రి దుర్మరణం

కుమారుడికి గాయాలు



శ్రీనివాస్(ఫైల్)

మర్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తండ్రి మృతి చెందగా.. ఆయన కుమారుడికి గాయాలయ్యాయి. ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. బర్మా క్యాంప్ ప్రాంతంలో నివాసముంటున్న ఉంద్రాజవరం శ్రీనివాస్(50), అతని కుమారుడు కల్యాణ్ బుధవారం ఇంటి నుంచి తాటిచెట్లపాలెం వైపు హైవేపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ధర్మానగర్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. బైక్ నడుపుతున్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా కల్యాణ్‌కు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ ఏదైనా వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడా? అతివేగం వల్ల బైక్‌ను నియంత్రించక పోవడంతో ఇలా జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది. కొంత మేర వరకు వాహనం డివైడర్ మీదుగా వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. వారు చెప్పిన మాటలు బట్టి వేగం నియంత్రించకపోవడంతోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుడి భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ ఓ ప్రైవేట్ కంపెనీలో, కల్యాణ్ మొబైల్ షోరూమ్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోస్టల్ రైడర్స్ బోణీ

ఖాతా తెరవని టైగర్స్



మ్యాచ్ బెస్ట్‌గా నిలిచిన కోస్టల్ రైడర్స్ ఓపెనర్, కెప్టెన్ రషీద్



రామన్ త్రోను అందుకుని హరిశంకర్‌ను రనౌట్ చేస్తున్న లేఖజ్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడవ సీజన్‌లో కోస్టల్ రైడర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. వైఎస్సార్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై ఎనిమిది పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో సీజన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన రైడర్స్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రషీద్ 47 బంతుల్లో ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 67 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ టెండూల్కర్ ఆరు పరుగులకే వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన అభిషేక్ 22 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో కెప్టెన్‌కు సహకరించి స్కోర్‌ను పరుగులెత్తించాడు. ధరణి, వర్ధన్‌లు చెరో 14 పరుగులు చేశారు. రామన్ 19 పరుగులతో నిలిచాడు. రషీద్ ఆట చివరి బంతి వరకు ఆడి ఆరో వికెట్‌కు 40 పరుగులు జోడించి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. టైగర్స్ బౌలర్ సాయితేజ రెండు వికెట్లు తీయగా హరిశంకర్, అఖిల్, లలిత్ చెరో వికెట్ పడగొట్టారు.

చివర్లో తడబాటు

ధాటిగానే లక్ష్య ఛేదనకు దిగిన బెజవాడ టైగర్స్ చివర్లో తలబడ్డారు. నాలుగు వికెట్లకు 128 పరుగులు వద్ద కెప్టెన్ రికీబుయ్ (34) వెనుతిరగడంతో మరో 11 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ధ్రువ్ 29 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 45 పరుగులు చేసి గట్టి పునాది వేశాడు. మరో ఓపెనర్ మహీప్(9), అతని స్థానంలో వచ్చిన లక్ష్మణ్(10) స్కోర్‌ను పెంచే క్రమంలో పెవిలియన్‌కు చేరాడు. కెప్టెన్ రికీతో కలిసి అవినాష్(42) నిలకడగా ఆడుతూ స్కోర్‌ను పెంచారు. దుర్గాకుమార్, హరిశంకర్ రనౌటై వెనుదిరిగారు. చివరికి తొమ్మిది వికెట్లకు 162 పరుగులతో టైగర్స్ ఇన్నింగ్స్ ముగిసింది. స్టీఫెన్, ప్రమోద్, రమన్ రెండేసి వికెట్లు తీసి జట్టుకు విజయాన్నందించారు. ఈ మ్యాచ్‌లో గేమ్ చేంజర్‌గా స్టీఫెన్, సూపర్ స్ట్రయికర్‌గా అభిషేక్, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రషీద్ నిలిచారు.

రాయలసీమ కింగ్స్ బాదేశారు

ఏపీఎల్ మూడో సీజన్‌లో భాగంగా బుధవారం ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. మరో పది బంతులుండగానే కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. టాస్ ఓడిన గోదావరి టైటాన్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్ ఓపెనర్‌గా 20 పరుగులు చేయగా మరో ఓపెనర్ విమల్‌కృష్ణ 35 బంతుల్లో మూడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 57 పరుగులు చేశాడు. ప్రసాద్ 21, శశికాంత్ 36 పరుగులతో రాణించారు. దీంతో ఏడు వికెట్లకు 175 పరుగులకు టైటాన్స్ ఇన్నింగ్స్ ముగిసింది. గిరినాథ్, సత్యనారాయణ చెరో రెండు వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ కింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన హనీష్ మూడో బంతికి శశికాంత్ బౌలింగ్‌లో జ్ఞానేశ్వర్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. నాలుగు పరుగులకే తొలి వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ ప్రశాంత్ 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 49 పరుగులు చేశాడు. రోషన్ అజేయంగా 70 పరుగులు చేయగా గిరినాథ్ నాలుగు బంతుల్లోనే ఏడు పరుగులతో నిలిచాడు. రోహిత్ 39 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించగా మూడో వికెట్‌కు 71 పరుగులు నమోదు చేసి.. కింగ్స్ విజయకేతనం ఎగురవేశారు. రోషన్ మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు.

బక్కన్నపాలెం ఐటీఐలో మిగుల సీట్లకు దరఖాస్తులు

మధురవాడ: బక్కన్నపాలెంలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు సహాయ సంస్థ(ఐటీఐ)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు ఆఫీసర్ జె.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. కార్పెంటర్ ట్రేడులో 24, షీట్‌మెట్ వర్కర్ 20, వెల్డర్ 20, పెయింటర్ ట్రేడులో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన 26 జిల్లాలకు చెందిన ఆసక్తి ఉన్న అర్హులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా వెబ్‌సైట్ iti.ap.gov in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత, నివాస, కులం, ఆదాయం, సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ సీహెచ్.భాస్కరరావును ఫోన్ నంబర్ 73964 24319లో సంప్రదించాలని పీవో కోరారు.

అధికారులపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం ఆగ్రహం

విశాఖ, దువ్వాడ రైల్వేస్టేషన్ల పరిశీలన



జీఎంకు సమస్యలు వివరిస్తున్న దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ ప్రతినిధులు

అగనంపూడి/తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌తో కలిసి విశాఖపట్నం, దువ్వాడ స్టేషన్‌లలో పర్యటించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులను పరిశీలించారు. మార్షలింగ్ యార్డ్స్, కోచింగ్ యార్డ్స్ వంటి కీలక విభాగాలలో తనిఖీలు చేశారు. సాయంత్రం మూడున్నర గంటలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక వ్యాగన్‌లో చేరుకున్నారు. ముందుగా వడ్లపూడిలోని రైల్వే వ్యాగన్ రిపేర్ షాప్ (డబ్ల్యుఆర్‌ఎస్)ను సందర్శించారు. తర్వాత అమృత్ భారత్ పథకంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కే సేనాపతి వర్క్‌షాప్ విధి విధానాల గురించి తెలిపారు. అనంతరం జీఎం వెయిటింగ్ హాళ్లు, రైల్వే కార్యాలయాలు, స్టాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం ఫ్లోరింగ్ మరమ్మతులకు గురై ఉండటం, మెట్లు కూడా సరిగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. ఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన మీద నుంచి నిర్మాణంలో ఉన్న భవన సముదాయ పనులు, ఆర్పీఎఫ్ బ్యారక్స్ పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించి విశాఖ పయనమయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి. మొయిత్ర, చీఫ్ ఆపరేషన్ మేనేజర్ వై.ఎస్.బాబు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, స్టేషన్ మేనేజర్ ముఖీ, ఇన్‌స్పెక్టర్ మాధురి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాము పాల్గొన్నారు.

నాగావళికి హాల్ట్ ఇవ్వాలి..

సంబల్‌పూర్ నుంచి నాందేడ్ వరకు నడుపుతున్న నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని దువ్వాడ రైల్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్‌ను వినతిపత్రంలో కోరారు. విశాఖతో సమాంతరంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్న క్రమంలో నాగావళికి హాల్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్, వి.జాషువా, ఎస్.రామకృష్ణ, కె.వీర్రాజు తదితరులు ఉన్నారు.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పలాస–విజయనగరం మెయిన్ లైన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

5వ తేదీన రద్దయిన రైళ్లు : పలాస–విశాఖపట్నం (07471) పాసింజర్, విశాఖ–పలాస(07470) పాసింజర్, విశాఖ–గుణుపూర్(08522) పాసింజర్, గుణుపూర్–విశాఖ(08521) పాసింజర్, విశాఖ–భవానిపట్న(08504) ఎక్స్‌ప్రెస్, విశాఖ–బ్రహ్మపూర్(08532) పాసింజర్, విశాఖపట్నం–భువనేశ్వర్(22820)ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్.

6న రద్దయిన రైళ్లు : బ్రహ్మపూర్–విశాఖ (18525) ఎక్స్‌ప్రెస్, భవానిపట్న–విశాఖ(08503) పాసింజర్, భువనేశ్వర్–విశాఖ(22819)ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ముంబయిలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరాల్సిన సీఎస్ఎంటి -భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మూడున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరుతుంది.
- భువనేశ్వర్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్- రామేశ్వర్(20896) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.40 గంటలకు బయల్దేరుతుంది.
- ఎస్ఎంవీటి బెంగళూరులో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవిటీ బెంగళూరు- గౌహతి (125090 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్య రాత్రి 1.40 గంటలకు బయల్దేరుతుంది.
- టాటానగర్‌లో శుక్రవారం ఉదయం 5.15 గంటలకు బయల్దేరాల్సిన టాటానగర్- ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 6.45గంటలకు బయల్దేరుతుంది.
- సంబల్‌పూర్‌లో శుక్రవారం ఉదయం 10.5 గంటలకు బయల్దేరాల్సిన సంబల్‌పూర్ -నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరుతుంది.
- సంత్రగచ్చిలో గురువారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి- తాంబరం (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మూడున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3.10గంటలకు బయల్దేరుతుంది.
- విశాఖపట్నంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం- విజయనగరం (07468) మెమూ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరుతుంది.

పీఎంపాలెంలో గుడి కూల్చివేతకు యత్నం

అడ్డుకున్న గాయత్రీనగర్ వాసులు



ఆర్ఐ ప్రవీణ్‌తో వాగ్వాదానికి దిగుతున్న స్థానికులు



పీఎంపాలెం గాయత్రీనగర్‌లో గుడి గోడను కూల్చుతున్న రెవెన్యూ సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం పరిధి గాయత్రీనగర్ జేఎస్ఎస్‌యూఆర్‌ఎమ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ పుట్ట బంగారమ్మ గ్రామ దేవత ఆలయాన్ని విశాఖ రూరల్ మండల ఆర్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కూల్చివేతకు బుధవారం యత్నించారు. పీఎం పాలెం సర్వే నంబరు 89కు సంబంధించి కాలనీలో ఖాళీగా ఉన్న 3 సెంట్ల స్థలంలో పుట్టబంగారమ్మ గ్రామ దేవత ఆలయం నిర్మాణానికి అనుమతి కోరుతూ విశాఖ సిటీ రిక్షా పుల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులకు స్థానికులు కొన్నాళ్లుగా వినతిపత్రాలు ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఉన్న 576 నివాసాలతోపాటు పరిసర ప్రాంతాల వారు చందాలు ఎత్తుకుని, కొందరు నాయకుల సహాయ సహకారాలతో కొద్ది నెలలుగా అమ్మవారి గుడి నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది ఆలయ గోడను పాక్షికంగా కూల్చివేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా నిర్మాణ పనులు చేయమని రాత పూర్వకంగా లెటర్ తీసుకుని వెళ్లిపోయారు. మరలా సాయంత్రం ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో వచ్చి గోడని మరోసారి కూల్చే ప్రయత్నం చేయగా మళ్లీ స్థానికులు ఎదురు తిరిగారు. ఎన్నో చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు నిర్మాణంలో ఉన్న గుడిని కూల్చివేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తొలగింపు పనులకు మహిళలు, గ్రామ పెద్దలు అడ్డుతగలడంతో చేసేదిలేక అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు.